స్థానికులనే ఇన్‌చార్జిగా నియమించాలి

విశాలాంధ్ర - దుంబ్రిగుడ: అరకు అసెంబ్లీ నియోజకవర్గంలో స్థానికులనే ఇన్‌చార్జిగా నియమించాలని ఆ పార్టీ నాయకులు శుక్రవారం మండలంలోని అరకు వారపు సంతలో భారీ ర్యాలీ నిర్వహించారు. నాన్ లోకల్ వద్దు లోకలే ముద్దు, బీసీ మాధవి గో బ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ అరకు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో వైసిపి పార్టీకి మంచి నాయకత్వ నాయకులు ఉన్నప్పటికీ వేరే నియోజకవర్గం నుంచి ఎంపీ మాధవిని కేటాయించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి ఎంపీపీ నీలవేణి, హుకుంపేట జెడ్పీటీసీ ఆర్.మత్స్యలింగం, వైసీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్ స్వామి, బి.సింహాచలం, సిహెచ్ కృష్ణారావు, నైని సత్తిబాబు, రఘునాథ్, భాస్కరరావు, కో ఆప్షన్ సభ్యులు మదిన కిరణ్, కోడా సింహాద్రి, ఆనంద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో ప్రభుత్వ భూమి సర్వే నెంబరు 17/1లోని 2.60ఎకరాల్లో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. సర్వే నెంబరు 17లో సబ్ డివిజన్ చేసి 17/1లోని 2.60 ఎకరాల భూమిని 2016లో పేదలకు ఇళ్ల స్థలాల కింద కేటాయించారు. అప్పటి నుండి పేదలకు పంపిణీ చేయలేదు. శ్రీరాంపురం గ్రామ పేదలకు కూడా ఇటీవల పక్కన ఉన్న ఎస్.నర్సాపురం గ్రామంలో ఇళ్ళ స్థలాలు పంపిణీ చేశారు. శ్రీరాంపురంలో ఉన్న ప్రభుత్వ భూమిలో పంపిణీ చేయాలని పలువురు కోరినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. దీంతో ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకోగా, మరికొంతమంది సాగు చేసుకుంటూ ప్లాట్లు వేసి అమ్మకాలు చేస్తున్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందడంతో ఎట్టకేలకు ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గారా కృష్ణప్రసాద్, ఆర్ఐ త్రినాథ్, సర్వేయర్ పి.సత్తిబాబు పాల్గొన్నారు.

అధికార వికేంద్రీకరణకు పంచాయతీరాజ్ వ్యవస్థ దోహదం

విశాలాంధ్ర - మల్కాపురం: అధికార వికేంద్రీకరణకు, ప్రజాస్వామ్యం విజయవంతం కావడానికి, స్థానిక సమస్యలు సత్వరం పరిష్కరించబడ డానికి పంచాయతీరాజ్ వ్యవస్థ ఎంతో అవసరం అని రాజనీతి శాస్త్ర సీనియర్ అధ్యాపకురాలు ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వ ర్యంలో పంచాయతీరాజ్ వ్యవస్థ - తీరు తెన్నులు అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతీ వ్యవస్థ బలోపేతమైందని, ఈ సవరణలను గురించి తెలుసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు వై.అనసూయా దేవి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి పాల్గొన్నారు.

మిడ్డే మీల్స్ కార్మికులకు బకాయిలు చెల్లించాలి

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండలంలోని వివిధ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మిక బకాయి వేతనాల బిల్లులు చెల్లించాలని గౌరవ వేతనం 15 రూపాయలు పెంచాలని కోరుతూ మండల సీఐటీయూ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళ్యాణ మండపం నుండి నాలుగు రోడ్ల కూడలి మీదుగా మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఎంఈఓ కృష్ణమూర్తికి వినతి అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం పది వేల రూపాయలు వేతనం ఇవ్వాలని, ప్రతి నెల 5వ తేది లోపల వేతనాలు, బిల్లులు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, జర్రెల ఉప సర్పంచ్ వి.గణపతి, గిరిజన సంఘం నాయకులు కె.నర్సయ్య, పి.రామదాసు, కార్మికులు కె.గురు, కె.గోపాల్, డి.రామారావుపాత్రో తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా పట్టివేత

విశాలాంధ్ర - పద్మనాభం: ఒడిశా చిత్రకొండ వద్ద నుంచి ఎస్.కోట చిన్నాపురానికి విశాఖ మీదుగా వెళ్తున్న వాహనంలో 125 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు పద్మనాభం మండలం సీఐ సన్యాసినాయుడు తెలిపారు. చిన్నాపురం జంక్షన్ వద్ద వాహన తనిఖీ చేస్తున్నప్పుడు ఈ గంజాయితో ఐదుగురు సభ్యులని పట్టుకున్నామని తెలియజేశారు. కె.గోపాల్, బి.పింకు, పి.వరప్రసాద్, బి.రామకృష్ణ, బి.రవిబాబులను అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం భీమిలి కోర్టుకు తరలించామని అన్నారు. సుమారు ఈ గంజాయి విలువ ఆరు లక్షలు ఉంటుందని తెలిపారు.

విజయం కోసం సైనికుల్లా పోరాడాలి

విశాలాంధ్ర - మధురవాడ: అన్ని రకాల అవాంతరాలు, పరిస్థితులను ఎదుర్కొని విజయం కోసం సైనికుల్లా పోరాడాలని డాక్టర్ యస్.వి.రవీంద్ర పిలుపునిచ్చారు. విరాట్ 2024 డిగ్రీ, మేనేజ్మెంట్, లా రెండు రోజుల ఉత్సవాలను ప్రారంభించారు. 5, 6 తేదీల్లో లా కాలేజీ, సిమ్స్ కళాశాల ప్రాంగణంలో రెండు రోజుల పాటు కార్యక్రమం జరగనుంది. సమతా కాలేజ్, గ్రీన్డేల్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ విజయ రవీంద్, గౌరవ అతిథి గంధం సునీత, వ్యాపార వేత్త, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపిక సమక్షంలో ప్రారంభించారు. అర్వర్దాస్, యన్.వి.పి లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అలక చంద్రుడు, సిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ లారెన్స్, సిమ్స్ డైరెక్టర్ డాక్టర్ వి.సాయి ప్రశాంత్, సియంటీ డైరెక్టర్ డాక్టర్ అర్చన ఈవెంట్ కన్వేయర్ డాక్టర్ ఉమా సుందరి మాట్లాడారు. విరాట్ 2024 -లా ఈవెంట్లు, 4-మేనేజ్మెంట్ ఈవెంట్లు 4-సాంస్కృతిక ఈవెంట్లను నిర్వహించింది.

అప్పన్నను దర్శించుకున్న ఐఏఎస్

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని కడప జిల్లా కడప అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఐఏఎస్ దంపతులు, తదితరులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్యనిర్వహణ అధికారి భ్రమరాంబ, పర్యవేక్షకులు పిల్లా శ్రీనివాస్ సాదర స్వాగతం పలికారు. ముందుగా వారు కప్పస్తంభం ఆలింగనం చేసుకుని తదుపరి స్వామి వారి ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. ఏఈఓ వేద పండితులచే వేద ఆశీర్వచనం చేయించి, ఆలయ పరిరక్షణ అధికారి పిల్లా శ్రీనివాస్ స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.

భాగ్యలక్ష్మి నియామకంపై హర్షం

విశాలాంధ్ర - చింతపల్లి: పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి బాగ్యలక్ష్మికి వైసీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ పగ్గాలు అప్పగించడం హర్షనీయమని ఆ పార్టీ చింతపల్లి జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంపీపీ కోరాబు అనూష దేవి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గ శాసన సభ్యురాలుగా ఉన్న భాగ్యలక్ష్మి నియోజకవర్గ అభివృద్ధిలోనూ అదే విధంగా పార్టీ బలోపేతానికి ఆమె

పడుతున్న తపనను చూసిన అధిష్టానం ఆమెను అల్లూరి జిల్లా అధ్యక్షురాలిగా నియమించిన విషయం పాఠకులకు తెలిసిందే అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ స్థానిక ఎంపీటీసీ సభ్యురాళ్లు దాసరి దారలక్ష్మి, చిందాడ జయలక్ష్మి, తాజంగి సర్పంచ్ వంతల మహేశ్వరి, మండల కన్వీనర్ గుణబాబు, యువజన శాఖ మండల కన్వీనర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

కశింకోట అభివృద్ధి అమర్నాథ్ కృషి ఫలితమే

విశాలాంధ్ర - కశింకోట: అమర్ అంటే అభివృద్ధి అని అభివృద్ధి అంటే అమర్ అనడానికి కారణం కశింకోటలో 15 కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం మంత్రి అమర్నాథ్‌కే దక్కుతుందని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ళ బుల్లిబాబు పేర్కొన్నారు. శనివారం జరగబోయే పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం కోసం స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి మంత్రి అమర్నాథ్, ఎంపీ సత్యవతి, నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్‌లు హాజరవుతారన్నారు. సంతబయలు వద్ద జరగబోయే పెన్షన్ల కార్యక్రమ పనులను అక్కడ వేదికను ఆయన పరిశీలించి వచ్చే పింఛను దారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేయాలని అక్కడ వారికి సూచించారు.

వ్యతిరేకతతోనే వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామా

విశాలాంధ్ర - అనంతగిరి: జగన్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు ప్రజాగ్రహాన్ని తట్టుకోలేక వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు గుడ్ బై చెబుతున్నారని మాజీ మంత్రి అరకు పార్లమెంట్ అధ్యక్షుడు కిదారి శ్రావణ్ కుమార్ అన్నారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని రాజీనామాలు చేస్తున్నారన్నారు. జగన్ రెడ్డిని నమ్ముకుంటే రాజకీయ భవిష్యత్తు

అంధకారమే అని భావించి పార్టీ మారుతున్నారన్నారు. ప్రజా సేవ చేయడంలో వైసీపీ పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థుల్లో ఓటమి భయం, ఒక్క ఛాన్స్‌తో ప్రజల విశ్వాసం కోల్పోయిన జగన్ రెడ్డి ఇప్పటి వరకు 38 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ప్రజలకు భయపడి సొంత సీటులో పోటీ చేసేందుకు సిద్ధంగా లేరన్నారు.

బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షులు, గాజువాక నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదేశాలతో 75వ వార్డు కార్పొరేటర్ దంపతులు పులి లక్ష్మీబాయి వెంకట రమణా రెడ్డి ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, 75వ వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి దొమ్మేటి పెరుమాళ్, ములకలపల్లి పెంటయ్య, కాకినాడ అప్పల రాజు, మొల్లి సోము నాయుడు, బస అప్పల రెడ్డి, మొల్లి అప్పారావు, దొమ్మేటి నాగరాజు, దొమ్మేటి సోము నాయుడు, నమ్మి పుష్ప పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో గుడివాడ గ్రామ పంచా యతీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబు రావు, నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు ప్రారం భించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సకాలంలో ఆదుకోవడంతో పాటు ధాన్యం కొనుగోలు లాంటి కార్యక్రమం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, వైస్ ఎంపీపీ అప్పన్న, స్థానిక సర్పంచ్ ధూళి శీను బాబు, మండల వ్యవసాయ శాఖ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర - అచ్యుతాపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం జగన్మోహన్ రెడ్డి అని భోగాపురం సర్పంచ్ లాలం లక్ష్మి పైడికొండ అన్నారు. శుక్రవారం యలమంచిలి ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు (కన్నబాబురాజు) ఆదేశాల మేరకు జగనన్న పెంచిన రూ.3 వేలు వైయస్సార్ పెన్షన్ కానుకను లబ్ధిదారులకు అందజేశారు. అంతకుముందు సీఎం జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

గెడ్డవాగుల కబ్జాపై చర్యలేవి

కబ్జాదారులకు అనుకూలంగా రెవెన్యూ యంత్రాంగం

స్పందన ఫిర్యాదులు సైతం భేఖాతర్

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ మండలం పెదముషిడివాడ పంచాయతీలోని విలువైన గెడ్డవాగులను కబ్జాదారుల నుంచి కాపాడడానికి రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నాళ్లుగా ఈ గ్రామ రెవెన్యూలో ప్రభుత్వ భూములైన గెడ్డవాగులు, చెరువులను అక్రమార్కులు చెరబడుతున్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు స్థానిక చోటా నాయకులే గెడ్డలు, వాగులు, చెరువులను కబ్జా చేసి అమ్మేయడం, అలా అమ్మేసిన స్థలాల్లో ఆ నాయకులే నిర్మాణాలు చేపట్టి ఇచ్చే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. స్పందనలో ఫిర్యాదులు నమోదవుతున్నప్పటికీ ఎలాంటి ఆక్రమణలు తొలగించకుండానే తప్పుడు ఎండార్స్‌మెంట్లతో ఆ ఫిర్యాదులను క్లోజ్ చేస్తున్నారు. గ్రామ సర్పంచ్ ఇంటి ముందరే సర్వే నెంబర్ 388లోని గెడ్డవాగు కబ్జాకు గురవగా, 347, 378, 388 సర్వే నెంబర్లలో గల గెడ్డవాగుల్లో ఆక్రమణలు చోటు చేసుకున్నాయి. అందులో పెద్ద పెద్ద ఇళ్ల నిర్మాణాలు కూడా జరిగాయి. దీంతో పలువురు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తూ వస్తున్నారు. అయినప్పటికీ అధికారులు ఉత్సవ విగ్రహంలా చూస్తున్నారు తప్ప ఆక్రమణలను తొలగించే చర్యలకు ఉపక్రమించ లేదు. ఈ వ్యవహారంలో వీఆర్వోపై అనేక ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఈ ఆక్రమణలపై తహశీల్దార్ వి.కనకారావును వివరణ కోరగా రెండు మూడు రోజుల్లో తొలగిస్తామని చెప్పారు.

స్థిరమైన అభివృద్ధికి చిరునామా మాడుగుల

ఉపముఖ్యమంత్రి బూడి

విశాలాంధ్ర - వి.మాడుగుల: భవిష్యత్తు తరాల వారి సొంత అవసరాలను తీర్చుకునే సామర్థ్యానికి రాజీ పడకుండా, ప్రస్తుత అవసరాలను తీర్చే విధంగా అభివృద్ధి పనులను చేపట్టామని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. వడ్డాది - పాడేరు, ఆర్ అండ్ బి రోడ్డు పెట్రోల్ బంక్ నుండి తర్రా లక్ష్మీనారాయణ వారి కల్లాల వరకు వీరవల్లి, పోతనపూడి అగ్రహారం మీదుగా 1.90 లక్షల రూపాయలతో నిర్మించిన తారు రోడ్డును మంత్రి ప్రారంభించారు. అలాగే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మాడుగులలో నూతనంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సేనాపతి కొండలరావు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎంపీ సత్యవతి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణమ్మ, ఎంపీపీ పెదబాబు, జిల్లా వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు అనురాధ, మండల పార్టీ అధ్యక్ష్యులు రాజారామ్ పలువురు ప్రజాప్రతినిధులు, మండల గ్రామ స్థాయి అధికారులు, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు పటిష్ట చర్యలు

కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న సాధారణ ఎన్నికల సందర్భంగా సంబంధిత శాఖల సమన్వయంతో డబ్బు, మద్యం, ఉచిత కానుకలతోపాటు మాదక ద్రవ్యాల కట్టడికి ఎన్ఫోర్స్మెంట్ చేయాలన్నారు. జిల్లా ఎస్పీ కే.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర శాఖల సమన్వయంతో పని చేసి మాదకద్రవ్యాల సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా అడ్డుకట్ట వేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కమిషనర్ జీఎస్టి ఆర్.ఎస్.వి.ప్రసాద్, జాయింట్ డైరెక్టర్ సెబ్ బి.విజయభాస్కర్, నర్సీపట్నం అదనపు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, కోస్ట్ గార్డు కమాండెంట్ గోవింద్ సరోన్, డి.ఆర్.ఓ. దయానిధి, నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి.జయరాం, డి.ఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ హేమంత్, వ్యవసాయ శాఖ జెడి మోహన్‌రావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి అజయ్ బాబు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ వి.సుబ్బరాజు, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ కె.లక్ష్మణ మూర్తి, నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ హెచ్‌టి వినియోగదారుల కోసం వర్చువల్ అకౌంట్ నంబర్లు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విద్యుత్ బిల్లుల చెల్లింపులకై హెచ్‌టీ వినియోగదారుల కోసం వర్చువల్ అకౌంట్ నంబర్ల కేటాయింపు ప్రక్రియను ఏపిఈపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి శుక్రవారం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ హెచ్‌టి వినియోగదారుల బిల్లు చెల్లింపు సౌలభ్యత కోసం 16 అంకెల వర్చువల్ అకౌంట్ నంబర్లను స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ద్వారా కేటాయించామని పేర్కొన్నారు. ఈ నంబరు ద్వారా విద్యుత్ బిల్లులను హెచ్‌టి వినియోగదారులు ఈపిడిసిఎల్‌కు నేరుగా చెల్లించే అవకాశాన్ని కల్పించామని, తద్వారా వారి ఖాతాకు తక్షణమే జమ చేయబడుతుందన్నారు. వర్చువల్ అకౌంట్ నంబర్లను సంస్థ వద్ద నమోదు కాబడిన వారి ఇ మెయిల్, వాట్సాప్, మొబైల్ నంబర్ల ద్వారా ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తామన్నారు. వినియోగదారులు వారికి కేటాయించిన నంబర్లను ఏపిఈపిడిసిఎల్ వెబ్ పోర్టల్‌లోని హెచ్‌టి వినియోగదారుల వ్యక్తిగత ఖాతా ద్వారా కూడా తెలుసుకొనే అవకాశం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఫైనాన్స్ డి.చంద్రం, సిజిఎంలు పి.శ్రీనివాస్, ఎం.రవీంద్ర, ఎస్‌బిఐ డిజిఎం పంకజ్ కుమార్, ఆర్ఎం ఐ.బాల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి



విశాలాంధ్ర - యస్.రాయవరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాయకరావుపేట నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని గుడివాడ గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు విద్యా, వైద్యం అందించడమే సీఎం లక్ష్యమన్నారు. పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేస్తున్న కార్యక్రమాల్లో దేశంలోని ఏ ప్రభుత్వం చేయలేదని అన్నారు. తమ సేవను గుర్తించి రాబోయే ఎన్నికల్లో ఈ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని కోరారు. తనకు ముఖ్యమంత్రి రాజ్యసభ ఎంపీగా అవకాశాన్ని కల్పిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ మహేష్, ఎంపీపీ కోన లోవలక్ష్మీ, జెడ్పీటీసీ కాకర దేవి, ఎంపీడీవో రామచంద్రమూర్తి, స్థానిక సర్పంచ్ దూళి శ్రీనుబాబు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు మాతా గురునాథరావు, వైసిపి జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, మండల వైసిపి యూత్ అధ్యక్షుడు వెంకటరాజు, జెఎస్‌వి కన్వీనర్ సందీప్, వైసిపి నాయకులు శ్రీపతి రాజు, అప్పల నరసింహవర్మ, కశింకోట నీలందరావు తదితరులు పాల్గొన్నారు.

పీవీటీజీలకు పక్కా గృహాలు మంజూరు

విశాలాంధ్ర - అరకులోయ: అర్హులైన పీవీటీజీలకు కేంద్ర ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేస్తుందని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ డిప్యూటీ సెక్రటరీ మనోజ్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తబల్లుగుడ పంచాయతీ కేంద్రంలో ప్రధానమంత్రి జన్‌మాన్ పథకాలపై అవగాహన కల్పించారు. పాడేరు ఐటీడీఏ పీఓ వి.అభిషేక్, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ డిప్యూటీ సెక్రటరీ మనోజ్ కుమార్ సింగ్ పాల్గొని మాట్లాడారు. ఆయా గ్రామాల్లో పక్కా రోడ్లు, అంగన్వాడీ కేంద్రాలు, విద్యుత్ సౌకర్యం వంటి అనేక వసతులు అందుబాటులోకి కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తుందన్నారు. పివిటిజి గ్రామాల్లో 100 కంటే అధికంగా జనాభా ఉంటే త్రాగునీరు, సిసి రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. అనంతరం వారు ఆయుష్మాన్ భారత్ కార్డులను గిరిజనులకు పంపిణీ చేశారు. కొత్తభల్లుగుడ బాలికల ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారులు విఎస్ ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, కెసిఆర్ ఎన్‌టిఎన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చిన్న బాబు, గృహ నిర్మాణ శాఖ పీడీ బాబు, పిఐయు ఈఈ లావణ్య కుమార్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ లీల కృష్ణ, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, ఎంపీడీవో వెంకటేష్, తహశీల్దార్ వేణుగోపాల్, ఎల్‌డిఎం రవితేజ, సర్పంచ్ కె.రాధిక, సీడీపీఓ తదితరులు పాల్గొన్నారు.

శివదలాయికు సేవా పురస్కారం

విశాలాంధ్ర - ఆనందపురం: సావిత్రి బాయి పూలే 193వ జయంతి సందర్భంగా సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ వారు నిర్వహించిన వేడుకల్లో భాగంగా మండలంలోని గంభీరమునకు చెందిన ఓఎస్‌జి ఫౌండేషన్ అధ్యక్షుడు శివ దళాయికి విశిష్ట సేవా పురస్కారం లభించింది. విశాఖలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖ స్టీల్ ప్లాంట్ సీవీఓ డాక్టర్ ఎస్.కరుణరాజు, ఎన్ఆర్ఏ మెడికల్ కాలేజ్ డీన్ డాక్టర్ పివి సుధాకర్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించి సావిత్రి బాయి పూలే విశిష్ట సేవా- పురస్కారం అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సిఈసిటి అధ్యక్షులు డా. గూడూరు సీతామహలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామ అక్షింతల పంపిణీ

విశాలాంధ్ర - భీమిలి: కృష్ణంరాజుపేట (డొంకర పేట) రామాలయం నుండి అయోధ్య భవ్య రామ "అక్షింతల"ను ప్రతి ఇంటికీ చేరవేయు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కృష్ణంరాజుపేట, డొంకర పేట, గుడ్డాల వారి కల్లాలు, మద్దిల పేట, సురాల వారి కల్లాలు లో అయోధ్య భవ్య రామ"అక్షింతలను"పంపిణీ చేయడం జరిగింది. ఈ అక్షింతలు పంపిణీ కార్యక్రమంలో జిల్లా పశు ఘన అభివృద్ధి చైర్మన్ భీమునిపట్నం జడ్పిటిసి గాడు వెంకటప్పడు, స్థానిక సర్పంచ్ గాడు వెంకటనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు గాడు శ్రీను, జిఎల్లయ్య, గాడు వెంకట్రావు, గాడు సన్యాసినాయుడు, మద్దిల శివ, కేబుల్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ, ఆర్‌జేడీ చేతుల మీదుగా డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ పాఠశాలల సంఘం (అప్సా) విశాఖ జిల్లా శాఖ జిప్సా సభ్యులు విశాఖ జిల్లా డీఈఓ యల్.చంద్రకళ, విద్య శాఖ ప్రాంతీయ సంచాలకులు (ఆర్.జె.డి) యమ్.జ్యోతి కుమారిలను మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డీఈఓ, ఆర్.జె.డిల చేతులు మీదుగా సంఘ డైరీలను ఆవిష్కరించి అధికారులకు, విద్యా శాఖ సిబ్బందికి పంచిపెట్టారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.సోమశేఖర్, పి.భాస్కరరావు, సభ్యులు రామకృష్ణ, శ్రీనివాస్, వాసుదేవరావు, రమేష్ నాయుడు, సత్యనారాయణ, గోవింద్ తదితరులున్నారు.

గీతం బిజినెస్ స్కూల్ విద్యార్థుల రక్తదానం

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎన్.టి.ఆర్. ట్రస్ట్ రక్త నిధి పర్యవేక్షణలో జరిగిన ఈ రక్తదాన శిబిరాన్ని గీతం బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. రక్తదానం ఎందరో ప్రాణాలను కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో బిజినెస్ స్కూల్ ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ షంషుద్దీన్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేస్తా: భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - జి.మాడుగుల: అరకు పార్లమెంట్ సహా ఆ నియోజక వర్గంలోని 7 శాసనసభ స్థానాలు కైవసం చేసుకునేందుకు ఆ నియోజక వర్గాల పార్టీ శ్రేణులతో కలిసి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అరకు పార్లమెంట్ సమన్వయ కర్తగా నూతనంగా నియమితులైన పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం చింతపల్లి వచ్చిన ఆమె ముందుగా 3 వేల రూపాయల పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అధిష్ఠానం తనపై ఉంచిన బాధ్యతను శిరసావహించి పనిచే యడం, ఆ పనిలో సత్ఫలితాలు సాధించడమే తన భాధ్యత అన్నారు.

గ్రామాల్లో వికసిత భారత్ సంకల్పయాత్రలు

విశాలాంధ్ర - కే.కోటపాడు: మండలంలో శనివారం నుండి ఈనెల 21వ తేదీ వరకు మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో వికసిత భారత్ సంకల్ప యాత్రలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి చేసిన కేటాయింపులపై రాష్ట్రవ్యాప్తంగా వికసిత భారత్ సంకల్ప యాత్రలు నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాల ప్రకారం శనివారం సూదివలస, పాతవలస గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - గొలుగొండ: ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని తపనతోనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జెడ్పీటీసీ వెంకటగిరి బాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి అన్నారు. శుక్రవారం పుత్తడి గైరంపేటలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఇక్కడికి వచ్చిన వైద్య బృందం అనేకమందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పత్తిరమణ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో 40 లక్షల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక వైసీపీ ఇన్‌చార్జి ఉరుకూటి చందు, వార్డు కార్పొరేటర్ బొండా జగన్‌లు శంకుస్థాపన చేశారు. సామాజిక భవన నిర్మాణం, సీసీ ఫ్లోరింగ్ నిర్మాణం తదితర పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, వార్డు ఇన్‌చార్జ్ కోమటి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బొడ్డ గోవిందా, మహిళా ఇన్చార్జ్ కె.రమాదేవి, జివిఎంసి డీఈ, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వవిద్యాలయం వేదికగా శుక్రవారం 37వ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్(యూనిఫెస్ట్) 2023-24 ప్రారంభమైంది. ఈ నెల 9వ తేదీ వరకు జరిగే ఈ సాంస్కృతిక ఉత్సవంలో పాల్గొనడానికి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పాండిచ్చేరి నుంచి 23 విశ్వవిద్యాలయాలకు చెందిన 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. శుక్రవారం సాయంత్రం ఏయూ పరిపాలనా భవనం వద్ద నుంచి విద్యార్థులతో సాంస్కృతిక ర్యాలీ అట్టహాసంగా ప్రారంభమైంది. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ టెక్నికల్ అబ్జర్వర్ మనీష్ జంగ్రా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐయూ అబ్జర్వర్ మనీష్ జంగ్ర మాట్లాడుతూ ఏఐయూ తరపున విద్యార్థులకు స్వాగతం పలికారు. ఏయూ సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించాలని కోరారు. నంది అవార్డు గ్రహీత కె.మహేంద్ర చక్రవర్తి మాట్లాడుతూ కళ సమాజ చైతన్యం కోసమన్నారు. కార్యక్రమం కల్చరల్ కన్వీనర్ ఆచార్య ఎన్.విజయ్ మోహన్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 40 విశ్వవిద్యాలయాలు దరఖాస్తు చేయగా ఏయూను ఎంపిక చేసి ఈ బాధ్యతలను ఏఐయూ అప్పగించిందన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ వందన సమర్పణ చేసారు. కార్యక్రమంలో ఓఎస్డి ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఏ.నరసింహా రావు, టి.శోభశ్రీ, వి.విజయలక్ష్మి, ఎస్.కె భట్టి, పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత,ఆచార్య కె.విశ్వేస్వర రావు, ఆచార్య ఏ.పల్లవి, ఆచార్య టి.షారోన్ రాజు, ఆచార్య కె.బసవయ్య, డాక్టర్ ఎన్.ఎం యుగంధర్, డాక్టర్ సి.హెచ్.ఏ.ఐ రాజు, ఆచార్య జానకీరాం, ఆచార్య రమేష్ బాబు, వెంకట్ గౌడ, నీలీష్, రాధ, రాజన్ కులకర్ణి పాల్గొన్నారు.

25వ రోజుకు అంగన్వాడీల సమ్మె

విశాలాంధ్ర - మారేడుమిల్లి: గత నెల 12వ తేదీ నుండి అంగన్వాడి, మినీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ చేస్తున్న దీక్షలు 25వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఎటపాక మండలం గోకబాక గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ పద్మ అనారోగ్యంతో పద్మ మృతి చెందడం జరిగింది. తోటి అంగన్వాడి టీచర్ మృతి పట్ల మండల అంగన్వాడి మినీ అంగన్వాడి హెల్పర్స్ మృతి పట్ల ఐదు నిమిషాలు మౌనం పాటించి సంఘీభావం తెలపడం జరిగింది. అనంతరం పోలీస్ స్టేషన్ కూడలి వద్ద అంగన్వాడీ అందరూ రోడ్డుపై వస్తున్న వాహనాలు ఆపి బిక్షాటన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి, వై రామవరం మండలం అంగన్వాడీ, మినీ అంగన్వాడీ కార్యకర్తలు వాల్పర్స్ పాల్గొన్నారు.

రావికమతం: అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 25 రోజులు చేరినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం చాలా దారుణమని అంగన్వాడీలు అన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మేన మీసాలు లెక్కబెడుతుందని ప్రాజెక్టు కార్యదర్శి సత్య వేణి ప్రశ్నించారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చకుంటే ఎట్టి పరిస్థితిలో తాము సమ్మెను విరమించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

యస్.రాయవరం: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మెలో భాగంగా పొర్లు దండాల కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై కార్యకర్తలు అందరూ తమ నిరసనలభాగంగా పొర్లు దండాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.సత్యనారాయణ, అంగన్వాడి సంఘం నాయకులు లక్ష్మి, సీతా రత్నం, వెంకట లక్ష్మి, బాల గౌరీ, రత్నం తదితరులు పాల్గొన్నారు.



పాయకరావుపేట: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగనవాడీ వర్కర్స్, హెల్పర్స్ చేస్తున్న ఆందోళన కార్యక్రమాలు శుక్రవారానికి 25 రోజులకు చేరుకుంది. ఈసందర్భంగా కోలాటాలు, పొర్లు దండాలు పెడుతూ వర్కర్స్, హెల్పర్స్ వినూత్న నిరసన నిర్వహించారు.

షర్మిల కాంగ్రెస్‌లో చేరికతో భారీ బైక్ ర్యాలీ

విశాలాంధ్ర - చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ కేంద్రంలో వై ఎస్ షర్మిల రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరడంతో చింతూరు మండల కాంగ్రెస్ సైనుకులు శుక్రవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద మిఠాయిలు పంచిపెట్టి పండుగల జరుపుకున్నారు. ఈ సందర్భంగా పిసిసి డెలిగేట్ ఎం డి హాబీబ్ మాట్లాడుతూ వైఎస్ షర్మిళ చేరికతో కాంగ్రెస్ పార్టీ ఏపీలో బలోపేతమవుతోందని అన్నారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కాంగ్రెస్ నాయకులు అహ్మదాలి, సొడే శ్రీను, జవహార్, కృష్ణ మూర్తి, నరేష్, రామారావు, రవి, లాజం, ప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సోమ కుటుంబానికి న్యాయం చేయాలి



విశాలాంధ్ర - హుకుంపేట: పార్టీ బలోపేతానికి అహర్నిశలు కష్టపడి పని చేసిన దివంగత నేత మాజీ అరకు ఎమ్మెల్యే సోమ కుటుంబానికి నేడు అన్యాయం జగిరితే సహించేది లేదని మండల తెలుగు యువత అధ్యక్షుడు కామేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దివంగత నాయకుడు సోమ మృతి చెందిన తరువారం పార్టీ అధినేత 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్టు ఇస్తానని సోమ తనయుడు అబ్రహంకు హామీ ఇచ్చారని దీనిని నేడు నేరవేర్చాలని కోరారు. అరకు నియోజకవర్గంలో అబ్రహంకు టికెట్టు ఇవ్వకుండా మరో వ్యక్తి ఇస్తే భారిగా ఓటమి పాలవుతుందని దీనిని తెదేపా అధిస్థానం గుర్తించాల ని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కామేశ్వరరావు, వెంకట్, స్వామి, సత్యరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం

విశాలాంధ్ర - హుకుంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగన్న ఆరోగ్య సురక్ష పేదలకు ఆరోగ్య రక్ష అని, సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలోనే మెరుగైన వైద్యా సేవలు అందిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.జమల్ భాష అన్నారు. శుక్రవారం మండలంలోని తాడిపుట్టు పంచాయితీ గడుగుపల్లిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో వైద్య సేవల నిమిత్తం వచ్చిన రోగుల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. గిరిజనులకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమం ద్వారా 139 మందికి వైద్య సేవలు అందించినట్లు ఆయన తెలిపా రు. ఈ కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సౌమ్య, ఎంపీటీసీ సింహాచలం, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్షేమంగా ఆశ్రమ పాఠశాల విద్యార్థి

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరి మండల పరిధిలో శివలింగపురం ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థి అనారోగ్యంతో బాధపడుతున్న పట్టించుకోలేదని సోషల్ మీడియాలో వచ్చిన కథనం పూర్తిగా అవాస్తమని అనంతగిరి అదనపు గిరిజన సంక్షేమ అధికారి వెంకటరమణ తెలిపారు. ఈ విద్యార్థి క్రిస్టమస్ సెలవులు సందర్భంగా వెళ్లాడని తర్వాత పాఠశాలకు రాలేదని కానీ విద్యార్థి జ్వరంతో బాధపడుతుంటే వారి తల్లిదండ్రులు అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతున్నాడని స్పష్టం చేశారు. అయితే ఈ విషయం సోషల్ మీడియాలో వచ్చిన అనంతరం పాడేరు డిడి తో కలిసి పరామర్శించడం జరిగిందని తెలిపారు. అయితే విద్యార్థి ఆరోగ్యం కుదుటగా ఉందని వైద్యులు తెలిపారని ఏ టి డబ్ల్యూ స్పష్టం చేశారు. వసతి గృహాల్లో ఏ విద్యార్థికి అనారోగ్యం జరిగిన తక్షణం వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. శివలింగపురం పాఠశాల డిప్యూటీ వార్డెన్ చలంతో పరామర్శించమన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు సక్రమంగా సరుకులు అందించాలి

విశాలాంధ్ర - హుకుంపేట: అంగన్వాడీ కేంద్రాలకు సరుకులు,బియ్యం సక్ర మంగా సరఫర చేయాలని సబ్ కలెక్టర్ దాత్రీ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవార మండలంలో గడుగుపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో సరుకులు పంపిణీ చేస్తున్న మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ (ఎం డి యు) వాహనంలో తూనికా, బియ్యం నిల్వలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల ప్రజలకు అందించే సరుకలు సక్రమంగా అందించాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి, సివిల్ సప్లై డిటి ఓలేసి ప్రశాంత్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - పరవాడ: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ పెందుర్తి నియోజక వర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం పరవాడ మండలం పెదముషిడివాడలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వాటి ద్వారా ప్రయోజనం పొందాలని సూచించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. బిజెపి పరవాడ మండల అధ్యక్షులు పిల్లా సతీష్, ఎంపీడీవో వి.హేమ సుందర్ రావ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏ.వో జీవీ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమార్, సర్పంచ్ నాగమణి, బిజెపి నాయకులు అప్పారావు, హేమ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం ఆరోగ్యానికి ఎంతో మేలు

విశాలాంధ్ర - చోడవరం: ప్రతీ రోజు వ్యాయామం, శారీరక శ్రమ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చోడవరం భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ కె సంతోష్ కుమార్ అన్నారు. భాష్యం పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వ్యాయామ విద్య కార్యక్రమంలో భాష్యం ప్రిన్సిపాల్ కె. సంతోష్ కుమార్ మాట్లాడారు. ఏ.పి.యోగ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పుల్లేటి సతీష్ విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఆరోగ్య మీద, ఆహారం మీద వ్యాయామం మీద అవగాహన కల్పించారు. అనంతరం స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు ద్వారా తల్లిదండ్రులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాల మంజూరు చేయాలి

విశాలాంధ్ర - ఆనందపురం: వేములవలస గ్రామంలో గ్రామసభ పెట్టి అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇంటి పట్టాలు అందించి ఇళ్ల స్థలాల మంజూరు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని భీమిలి టిడిపి పార్టీ ఇంచార్జ్ కోరాడ రాజబాబు తెలిపారు. ఈ సందర్భంగా మండల రెవెన్యూ అధికారి లోకవరపు రామారావు కు టిడిపి ఇన్చార్జ్ వినతి పత్రాన్ని అందజేశారు. దానికి తహశీల్దార్ సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా సమస్య పరిష్కారం చేస్తామన్నారు.

వచ్చే ఎన్నికల్లో ప్రజలు జగన్‌కు అండగా నిలబడాలి

మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేసింది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అయితే గత ఎన్నికలలో 600 హామీలు ఇచ్చి కనీసం ఒక్క హామీని కూడా నెరవేర్చని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని, వీరిద్దరిని బేరీజు వేసుకొని రానున్న ఎన్నికల్లో ఓటర్లు నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ విజ్ఞప్తి చేశారు. వైయస్సార్ పెన్షన్ భాగంగా జీవీఎంసీ పరిధిలో లబ్ధిదారులకు 3000 రూపాయలు చొప్పున పెంచిన అందించే కార్యక్రమంలో మంత్రి అమర్నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి నగరంలో ప్రతినెల పించన్ల కోసం మూడు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని తెలియజేశారు. 2019లో రాష్ట్రంలో 36 లక్షల మంది పెన్షన్‌దారులు ఉంటే, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ సంఖ్య 66 లక్షలకు చేరుకుందని, అంటే చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో ఎంత మందికి పెన్షన్లు అందలేదు అర్థం చేసుకోవచ్చని అమర్నాథ్ అన్నారు. ఎంపీ బిశెట్టి సత్యవతి మాట్లాడుతూ వృద్ధులు వికలాంగులు, పేదల ఆర్థిక ఇబ్బందులు పడకూడదని జగన్మోహన్ రెడ్డి క్రమం తప్పకుండా పింఛను మంజూరు చేస్తున్నారు అని చెప్పారు. కార్యక్రమంలో అనకాపల్లి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, కార్పొరేటర్ మందపాటి సునీత తదితరులు ప్రసంగించారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు

విశాలాంధ్ర - పాయకరావుపేట: విశాఖ హెచ్‌పీసీఎల్ సౌజన్యంతో పాయకరావుపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని మంగవరం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను శుక్రవారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు ప్రారంభించారు. సుమారు రూ.1.30కోట్లతో పెట్రోల్ బంక్‌ను నిర్మించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ సొసైటీలు మల్టీ సర్వీస్ సెంటర్ స్కీముకు పాయకరావుపేట పీఏసీఎస్ ఎంపికైనట్లు తెలిపారు. ఇందులో భాగంగానే పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సహకార సంఘాలు బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పెట్రోల్ బంక్‌లో అమ్మకాలపై వచ్చే కమీషన్ సొసైటీ అభివృద్ధికి దోహద పడతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, జడ్పీటీసీ లంకా సూర్యనారాయణ, ఇసరపు తాతారావు, జగతా శ్రీను, పీఎసిఎస్ చైర్మన్లు దేవవరపు రాజేష్‌ఖన్నా, కె.సుందరలత, కోడా కోటేశ్వర రావు, వన్నీరు బాబ్జి, వంగలపూడి రామారావు, గూటూరు రామగోవిందు, దేవవరపు వెంకటేశ్వరరావు, బిఎం లీలా శివజ్యోతి, హెచ్‌పిసిఎల్ సేల్స్ ఆఫీసర్ యాష్ మిశ్రా, పీఏసీఎస్ కార్యదర్శి పి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

మృతదేహంతో విపక్షాల రాస్తారోకో

విశాలాంధ్ర - కూనవరం: ఎటపాక మండలం ఎర్రబోరుకు చెందిన మడకం సంధ్య కూనవరం మండలంలోని నర్సింగపేట ఆశ్రమ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతుంది. గత రెండు రోజులుగా సంధ్య కడుపు నొప్పితో బాధపడు తుండగా స్థానిక కోతులగుట్టలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో చూపించడం జరిగింది. గురువారం రాత్రి కడుపునొప్పి ఎక్కువ అవడంతో భద్రాచలం తీసుకెళ్లాల్సిందిగా వైద్యులు సూచించడంతో భద్రాచలంలో చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో సంధ్య ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల ప్రిన్సిపాల్‌ను, వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని సంధ్య కుటుంబానికి 10 లక్షల రూపాయలు పరిహారం ప్రభుత్వం ప్రకటించాలని సంధ్య తల్లి సావిత్రికి ఉద్యోగం ఇప్పించాలని తగు న్యాయం చేయాలని విపక్షాలు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో నిర్వహించిన వారిలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, గిరిజన సంఘం నాయకులు మాజీ ఎంపీపీ పోడియం అప్పారావు, ముత్తయ్య, తెలుగుదేశం నాయకులు ఎడవెల్లి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో బలమైన సామాజిక వర్గానికి సీట్లు కేటాయించాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాబోయే శాసనసభ ఎన్నికలలో అభ్యర్థుల ఎంపికలో పాడేరు ఏజెన్సీలో ఉన్న బలమైన సామాజిక వర్గాలు భగత, వాల్మీకి, కొండదొర. ఈ మూడు సామాజిక వర్గాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని ఆదివాసీ వాల్మీకి సంక్షేమ సంఘం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి. ఈ మేరకు సీఎంకు లేఖ రాశారు. కొన్ని దశాబ్దాలుగా రాజకీయ నేపథ్యమున్న ఆదివాసి వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వారు ఎమ్మెల్యేలుగా ఎంపీలుగా గెలిచా రని గుర్తు చేశారు. తమ యొక్క పాలనా దక్షత వలన గిరిజన ప్రజలు తమ పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారన్నారు. రాబోయే ఎన్నికలలో అల్లూరి సీతారామరాజు జిల్లా పార్టీ అభ్యర్థులు ,సమన్వయ కర్తల ఎంపిక విషయంలో కొంతమంది స్వార్ధ ప్రయోజనాలు ఆశించి తమకిచ్చిన నిరాధారమైన తప్పుడు సమాచారం ఇస్తున్నారన్నారు. మా సామాజిక వర్గం (ఆదివాసి వాల్మీకి)కు ప్రాధాన్యత ఇవ్వకపోవుటను యావత్ మా జాతి అసంతృప్తి తో ఉన్నారని సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఒంద్రు రామ్మూర్తి ,కిముడు రామారావు పేర్కొన్నారు.

కవగుంటలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

విశాలాంధ్ర - రావికమతం: మండలంలో కవగుంట గ్రామంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గల రాజేశ్వరరావు, అలాగే సచివాలయ సిబ్బంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ, గృహ నిర్మాణ శాఖ, వ్యవసాయ శాఖ, వెలుగు, ఉపాధి హామీ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే రాజేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య, ఆయుష్మాన్ భవ, పీఎం కిసాన్, ఉపాధి హామీ, ఉచిత ఉజ్వల గ్యాస్ పథకం ప్రధానమంత్రి ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టు, బీమా సౌకర్యం, జల జీవన మిషన్ మొదలగు పథకాలను అందిస్తుందని తెలిపారు. వాటిని ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి సూర్యకుమారి, వరహాలు, సచివాలయ కన్వీనర్ దాసరి వరహాలు, పంచాయతీ కార్యదర్శి స్వామి, సచివాలయ సిబ్బంది శ్యాము, రాజేంద్ర, శరత్, వార్డు మెంబర్లు పలువురు పాల్గొన్నారు.

అందరి ఆనందమే సీఎం లక్ష్యం

విశాలాంధ్ర - చింతపల్లి: వృద్ధులు వితంతువులు, వికలాంగుల ముఖాలలో ఆనందం నింపడమే పెన్షన్ల పంపిణీ లక్ష్యమని పాడేరు శాసనసభ్యురాలు, అరకు పార్లమెంటు సమన్వయకర్త కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. సామాజిక పెన్షన్ పథకం ద్వారా అందిస్తున్న పెంచిన పెన్షన్ 3000/- ల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో ఆశాజ్యోతి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అరకు పార్లమెంట్, పాడేరు శాసనసభ నియోజకవర్గాల సమన్వయ కర్తలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, మత్స్యరాస విశ్వేశ్వర రాజులు స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, స్థానిక ఎంపీటీసీలు ధారలక్ష్మీ, జయలక్ష్మి ల చేతుల మీదుగా లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు సభ్యులు మీనా కుమారి, రూతు, సోనీ, సర్పంచ్‌లు లలిత, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - ఎటపాక : సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని గుండాల ఎంపిటిసి గొంగడి వెంకట రామిరెడ్డి పేర్కొన్నారు. ఎటపాక మండలం గుండాల కాలనీలో సర్పంచ్ గుండి సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగిన గ్రామ సభకు ముఖ్యఅతిథిగా గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి హాజరై మాట్లాడారు. ప్రస్తుత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి, వారిని ఆర్థికంగా ఏ విధంగా మన ప్రభుత్వ పథకాల ద్వారా, ఏ విధంగా లబ్ధి చేకూరింది అనే విషయాన్ని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, సర్పంచ్ గుండి సీతా లక్ష్మి, ఉప సర్పంచ్ తోట శశి కుమార్, సచివాలయ కన్వీనర్లు, ఎర్ర గొల్ల నరసింహారావు, కాకాని సురేష్, ముత్తిపోయిన రాము, వార్డు మెంబర్ రేగలగడ్డ వీరమ్మ పాల్గొన్నారు.

అమేజాన్ ఫ్రెష్‌పై సూపర్ వేల్యూ డేస్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: 'సూపర్ వేల్యూడేస్' పేరుతో జనవరి 7 వరకు అమేజాన్ ఫ్రెష్ పలు ఉత్పత్తుల అందుబాటులోకి తీసుకువచ్చినట్టు ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. తాజా ఉత్పత్తులు, ప్యాంట్రీ నిత్యావసరాలు, రుచికరమైన వంటకాల విభిన్న శ్రేణిని 45 శాతం వరకు రాయితీ ధరలో అందిస్తున్నామన్నారు. ఆకర్షణీయమైన పండ్లు, కూరగాయలు నుండి విశిష్టమైన పదార్థాల వరకు, అమేజాన్ ఫ్రెష్ వంటల ప్రాధాన్యతలకు అనుకూలమైన ఎంపికను కేటాయిస్తుందన్నారు.

నాలుగు కొత్త ఫండ్ ఆఫర్‌లను విడుదల చేసిన టాటా అసెట్ మేనేజ్‌మెంట్

విశాలాంధ్ర -విశాఖ సిటీ: టాటా అసెట్ మేనేజ్‌మెంట్ నాలుగు కొత్త స్కీమ్‌లను ప్రారంభించినట్లు వెల్లడించింది. వాటిలో 2 ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటిఎఫ్ లు), 2 ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్ ఓ ఎఫ్) వున్నాయి. టాటా గోల్డ్ ఇటిఎఫ్ - ఓపెన్-ఎండెడ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్, బంగారం యొక్క దేశీయ ధరను ప్రతిబింబించటం ట్రాక్ చేయటం చేస్తుంది. ఈ ఎన్ఎఫ్ఓ 2 జనవరి 2024 నుండి 9 జనవరి 2024 వరకు తెరవబడుతుంది. టాటా గోల్డ్ ఇటిఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్- టాటా గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్‌లో పెట్టుబడి పెట్టే ఓపెన్-ఎండ్ ఫండ్ ఫండ్ పథకం.

నాటుసారా సీజ్

విశాలాంధ్ర - రావికమతం: మండలంలో పిల్లవానిపాలెం గ్రామానికి చెందిన బుద్ది రెడ్ల శివ మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఆయన వద్ద ఉన్న 20 లీటర్ల నాటు సారాను సీజ్ చేసి ఆయన్ను అరెస్టు చేయడం జరిగిందని రావికమతం ఎస్ఐ ఉమామహేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అక్రమ మద్యం తయారీ, విక్రయదారులపై ప్రత్యేకమైన డ్రైవ్ నిర్వహించి వారి పైన కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ సి డబ్ల్యూ సి లో ఉదయం 10 గంటలకు కనితి అప్పలరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. జిల్లా నాయకులు ఎస్కే హుస్సేన్, వర్మ, కెపి కుమార్, కే దీనబంధు పాల్గొని మాట్లాడారు. ముందుగా ఏదైతే గతంలో డిమాండ్ చేసామో ప్రతి పెన్షనర్ కి కూడా కనీస పెన్షన్ 9000 ప్లస్ డిఎ ఇవ్వాలని అన్నారు. ఎత్తివేసిన రైల్వే ప్రయాణపు సబ్సిడీని పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో బి.గుర్రప్ప, వెంకట్రావు, ఎన్.అప్పల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చోడవరం బీసీ హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల క్రమ శిక్షణారాహిత్యానికి పాల్పడ్డారని రుజువు కావడంతో, హాస్టల్ సంక్షేమాధికారి ఆర్.చిన్నయ్యను సస్పెన్షన్ చేస్తున్నట్లు జిల్లా బి.సి.సంక్షేమ అధికారిణి కె.రాజేశ్వరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారులు నుండి తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు సస్పెండ్ చేసినట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి కే.రా ప్రకటనలో తెలియజేశారు. చోడవరం బీసీ హాస్టల్ కు చెందిన బాలుర దురలవాట్లపై వైరల్ అయిన వీడియో నేపథ్యంలో ఆమె విచారణ జరిపామన్నారు.

గోస్తని నదిలో పడి యువకుడు దుర్మరణం

విశాలాంధ్ర - పద్మనాభం: పాంద్రంగి పంచాయతీ సామయ్య వలస గ్రామానికి చెందిన సేనాపతి వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆమె భర్త సేనాపతి రాము (34) గ్రామానికి సమీపంలో ఉన్న గోస్తిని నది ఒడ్డున స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈత రాకపోవడం వల్ల మునిగి చనిపోయినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొందని చెప్పారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలియజేశారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

శ్రీమోదమాంబ ఆలయానికి 25వేల విరాళం

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామంలో వెలసిన శ్రీశ్రీ మోదకొండ అమ్మవారి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన గాలిగోపురానికి మాడుగుల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త రాయపరెడ్డి కృష్ణ 25వేల రూపాయలు విరాళాన్ని గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు చెక్కు రూపంలో అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ కృష్ణకు కండువా వేసి మెమోంటోను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల మండల నాయకులు శివాజీ, అప్పన్న ప్రసాద్, ఎం.కోడూరు గ్రామ జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

తర్లువాడలో వైయస్సార్ పెన్షన్ పంపిణీ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీలో సర్పంచ్ బి ఆర్ బి నాయుడు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు చేతుల మీదుగా శుక్రవారం వయో వృద్ధులకు వైయస్సార్ పింఛన్‌ను అందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పిన విధంగా పెన్షన్ పెంచి లబ్ధిదారులకు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాల సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పెద్ద ఉరుములో సీఐ పర్యటన

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండల కేంద్రం పెద్ద ఉరుములో జి మాడుగుల స్థానిక సీఐ రమేష్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పెద్దలని ప్రజల్ని అక్కడ ఉన్న వారి సమస్యలను తెలుసుకుని తక్షణమే పై అధికారులకు తెలియజేసి ఆ సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరిస్తామని అన్నారు. గంజాయి సాగుకు దూరంగా ఉండాలని అన్నారు.

స్వయం ప్రతిపత్తి పై విద్యార్థులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - పెందుర్తి : స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో స్వయం ప్రతిపత్తిపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ ఈ ఫ్లోరా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.ఎం.ఈ టెక్నాలజీ సెంటర్ తరపున ఎంటర్ ప్రీమియర్ షిప్ విభాగంలో నిపుణులు, నిష్ణాతులు పాల్గొని విద్యార్థులకు స్వయం ప్రతిపత్తి అంశంపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా డిఐసి జనరల్ మేనేజర్ సిహెచ్ గణపతి పాల్గొని ప్రసంగిస్తూ స్వయం ప్రతిపత్తి అంశంలో ఔత్సాహిక్తులైన విద్యార్థులందరూ ప్రతిపత్తి ఏర్పాట్లు కోసం నిధులు సులభంగా ఎలా సమకూర్చుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన టెక్నాలజీ సెంటర్ మేనేజర్ జి రాజకుమార్ మాట్లాడుతూ నూతనకరమైన ఆలోచన దృక్పథం కలిగిన విద్యార్థులు స్వయం ఆధారంగా అభివృద్ధి సాధించుట కొరకు రాష్ట్ర ప్రభుత్వం స్వయం ప్రతిపత్తి అభివృద్ధిపై ఎన్నో సంస్కరణలు అమలు చేస్తుందని తెలిపారు ఈ కార్యక్రమం భవిష్యత్తులో విద్యార్థుల స్వయం అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని ఉద్బోధించారు. ఎం.ఎస్.ఎం.ఈ టెక్నాలజీ సెంటర్ కన్సల్టెంట్ రిటైర్డ్ ఐఏఎస్, డిప్యూటీ డైరెక్టర్ ఎం కాలేబు ఈ అవగాహన సదస్సులో ప్రసంగిస్తూ స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలను ఏర్పాటు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న సంస్కరణలపై విద్యార్థులకు చక్కని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ్ డిగ్రీ కళాశాల సెక్రటరీ టి థియఫిలుస్, ఎం.ఎస్.ఎం.ఈ టెక్నాలజీ సెంటర్ తరపున విచ్చేసిన గౌరవ అతిధులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, గౌరవ సన్మానాలతో సత్కరించారు. ఈ సదస్సులో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ శ్రీనివాసరావు, ఏవో రవిబాబు, సిబ్బంది ఆదర్శ్ కళాశాల విద్యార్థిని విద్యార్థినిలు పాల్గొన్నారు. ఆదర్శ్ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి కమిటీ కోఆర్డినేటర్ రాజేశ్వరరావు ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షించారు.

ప్రభుత్వ నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించండి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం : రాష్ట్రంలోని అంగన్వాడి, మున్సిపల్, సర్వ శిక్ష అభియాన్ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించండి అని స్టీల్ సిఐటియు గౌర వాధ్యక్షులు జె అయోధ్యరామ్ పిలుపు నిచ్చారు. నేడు స్టీల్ సిఐటియు, సిఐటియు కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో స్టీల్ ప్రధాన పరిపాలన భవనం వద్ద వీరికి సంఘీభావంగా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి జె అయోధ్యరామ్ మాట్లా డుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు చేసిన వాగ్దా నాన్ని నెరవేర్చమని రాష్ట్రంలోని అంగ న్వాడిలు గడచిన 25 రోజులుగా వివిధ పద్ధతులలో తమ నిరసనలు తెలియజేస్తుంటే వీటిని ఏవి పరిగణలోకి తీసు కోకుండా రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని ఆయన విమ ర్శించారు. కనీస వేతనం ఇమ్మని కోర్టులు ప్రభుత్వాలకు ఆదేశించినప్పటికీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించడానికి ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. నేటి ప్రభు త్వం వారి వేతనంలో వెయ్యి రూపాయలు మాత్రమే పెంచారని ఆయన అన్నారు. ఒకపక్క వారితో చర్చలు జరు పుతూనే వారిపై పోలీసులతో దమన కాండకు దిగడం అప్రజాస్వామ్యమని ఆయన వివరించారు. కనుక వీరి డిమాం డ్లను పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటిదాస్, యూజ్ ప్రధాన కార్యదర్శి కె పరంధామయ్య, స్టీల్ సిఐటియు నాయకులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, కె.గంగాధర్, స్టీల్ సిఐటియు ఒప్పంద కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, అధ్య క్షులు జి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వివి రమణ తదితరులతో పాటు వివిధ విభా గాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

తరగతి గదుల నుంచే అద్భుత ఆవిష్కరణలు

పల్సస్ సీఈవో డా.గేదెల శ్రీనుబాబు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : అద్భుత అవకాశాల వేదిక అయిన విశాఖ నగరం 2030 నాటికి 100 బిలియన్ల ఆర్థికవృద్ధి సాధించేందుకు దోహదపడుతుందని పల్సస్ సీఈవో డా.గేదెల శ్రీనుబాబు వివరించారు. విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. వైజాగ్‌ను 100 బిలియన్ల ఆర్థిక నగరంగా తీర్చి దిద్దేందుకు ఉన్న అవకాశాలను, ప్రణాళికలను వివరించారు. నగర ఆర్థిక గమ్యాన్ని రూపొందించడంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని శ్రీనుబాబు పిలుపు నిచ్చారు. ఈనాటి ప్రపంచ ప్రఖ్యాత ఆవిష్కరణలన్నీ ఒకప్పుడు తరగతి గది నుంచి వచ్చినవే అని చెప్తూ ఈ రోజుల్లో ఉన్న ఫేస్ బుక్ గూగుల్ మరియు పెద్ద పెద్ద ఇన్నోవేటివ్ సంస్థలు తరగతి గది నుంచి ఉద్భవించినవే అని చెప్పారు.

బ్లూ ప్రింట్ ఆవిష్కరణ

వైజాగ్‌లో 100 బిలియన్ల ఆర్థికశక్తిగా ఎదిగేందుకు అవసరమైన బ్లూప్రింట్‌ను గేదెల శ్రీనుబాబు ఆవిష్కరించారు. విశాఖ ఒక అందమైన నగరం మాత్రమే కాదు, ఒక బలీయ మైన ఆర్థిక శక్తి కేంద్రం అని వివరించారు. బలమైన ఆర్థిక వ్యవస్థను పెంపొందించడంలో విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య సహకారం చాలా కీలకమని పేర్కొన్నారు. అకాడమిక్ క్లాస్‌రూమ్‌ల నుండి బిజినెస్ బోర్డ్‌రూమ్‌ల వరకూ విద్యార్థులు ఎదగాలన్నారు.

విగ్రహ ప్రతిష్టకు మాజీ ఎంపీ గీత శంఖుస్థాపన

విశాలాంధ్ర - దేవీపట్నం : మండలంలోని ఎం.రావిలంక శివారు మునినిగుంట గ్రామం వద్ద ఉన్న హనుమంతు శిఖరంలో హనుమంతుని విగ్రహ ప్రతిష్టకు అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీత శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ ఒక సామాన్య వ్యక్తి స్వప్నంలో ఆంజనేయ స్వామి దర్శనమిచ్చి ఇక్కడ గుడి కట్టాలని దైవేచ్ఛ కల ప్రకారం రావిలంక గ్రామానికి చెందిన చక్రవర్తి అనే యువకుడు ఆలయ నిర్మాణానికి నాంది పలకటం గొప్ప విషయమని అతని కల సాకారం చేసేలా గుడి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహకారం అంతా తాను భరించ నున్నట్టు ఆమె పేర్కొన్నారు. హిందుత్వమే ధ్యేయంగా ఏజన్సీ ప్రాంతంలో దైవ కార్యక్రామాలకు శ్రీకారం చుట్టడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలు కు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తురసం సుబ్బారావు రావిపాటి ఏడుకొండలు దివిటీ గణపతి రావు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర - జి.మాడుగుల : మండలలి హెడ్ క్వార్టర్ పంచా యతీ పరిధిలో వివిధ గ్రామలలో వృద్ధాప్య వితంతు పెన్షన్ల పంపిణీలో స్థానిక సర్ప ంచ్ కిముడు రాంబాబులి గారు చేతుల మీదుగా పెన్షన్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మన ముఖ్య మంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు ప్రతి అవ్వ, తాతకు వితంతువులకు వృద్ధులకు పెన్షన్ 3000 రూపాయలు ఇస్తాను అని చెప్పి మాట ఇచ్చి మాట తప్పకుండా ఇవ్వటం జరిగింది. ఈ యొక్క పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో వైస్సార్సీపీ మండల అధ్యక్షలు నుర్మనీ మత్య కొండబాబు, కన్వీనర్‌లు, గృహశారాదులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మండల అధ్యక్షులుగా బొంతు రమణ

విశాలాంధ్ర - మాకవరపాలెం : మాకవరపాలెం మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా బొంతు రమణ నియమితు లయ్యారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీసాల సుబ్బన్న, కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

జగన్మోహన్ రెడ్డికి పాలాభిషేకం

విశాలాంధ్ర - గొలుగొండ : వైయస్సార్ పెన్షన్ కానుక పెంపు సందర్భంగా సిహెచ్ నాగపురం గ్రామంలో సర్పంచ్ ఎల మంచిలి రఘు రామచంద్రరావు ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రఘురామచంద్రరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు అవ్వ తాతలకు ఇచ్చే పెన్షన్లు 3000కు పెంచుకుంటూ వెళ్తానని ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెన్షన్ 3000 కు పెంచామని ఈ సందర్భంగా ఆయన అన్నారు వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని అక్క చెల్లెలు అవ్వ తాతలు మరోసారి ఆశీర్వదించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

షర్మిల చేరికతో కాంగ్రెస్‌లో నూతన ఉత్సాహం

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీ ఉల్లా

విశాలాంధ్ర - పెందుర్తి : స్వర్గీయ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె షర్మిల చేరికతో కాంగ్రెస్ పార్టీలో నూతన ఉత్సాహం కనిపిస్తోందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీఉల్లా పేర్కొన్నారు. శుక్రవారం పెందుర్తిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీ సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. రాష్ట్రానికి మేలు చేయడానికి కాంగ్రెస్ వద్ద అనేక ప్రణాళికలు ఉన్నాయని, అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని అమలు చేసి రాష్ట్రాన్ని సర్వతో ముఖాభివృద్ధి చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలోని అనేకమంది ముఖ్య నాయకులు కాంగ్రెస్ లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నిరుపేద విద్యార్థులకు సహాయం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : అల్లూరి సీతా రామరాజు జిల్లా మండలం కేంద్రం ఎస్సీ కాలనీ నందు డే కేర్ సెంటర్‌లో 95 మంది నిరుపేద విద్యార్థులకు ఖమ్మం హెూప్ చారిటబుల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో శుక్రవారం నిరుపేద విద్యా ర్థులకు దుప్పట్లు, గిఫ్ట్ ప్యాకెట్స్, టాయ్స్ వడ్డిగూడెం సర్పంచ్ ఎస్.నరసమ్మ చేతుల మీదగా అంద జేయడం జరిగింది. ఈ కార్యక్రమంని ఉద్దేశించి నిరుపేద ప్రజలకు ఏ విధంగా సహాయం చేయడం చదువు చెప్పించడం గర్వించదగిన విషయ మని కొనియాడారు. డే కేర్ సెంటర్ ఇన్చార్జ్ కె. సతీష్ కుమార్ మాట్లా డుతూ. ప్రతిరోజు సాయంకాలం ఉచితముగా ట్యూషన్ ఏర్పాటు చేయడం జరిగినది అదేవిధంగా చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ట్యూషన్ చెప్పడం జరుగుతుందన్నారు. ఖమ్మం హెూప్ చారిటబుల్ సొసైటీ ద్వారా వి. ఆర్. పురం లో ఎస్సీ కాలనీ నందు ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు ఉచితముగా ట్యూషన్ చెప్పి పిల్లలను ఉన్నత చదువులు నిమిత్తం మార్గం వెయ్యడం జరుగుతుందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అడ్మిని స్ట్రేట్ రమేష్, సంస్థ అకౌంటెంట్ షేక్ యాసిన్ పాషా, సెంటర్ ఇంచార్జ్ పాస్టర్ కె.సతీష్ కుమార్, కె.అరుణ,కె. నవీన, ఏం.అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

వికాస్ భారత్ సంకల్పయాత్ర

విశాలాంధ్ర - భీమిలి : కేంద్ర ప్రభుత్వం వారి ఆధ్వర్యంలో (వికాస్ భారత్ సంకల్ప యాత్ర) ఈ రోజు భీముని పట్నం మండలం సింగన్న బంధ గ్రామ పంచా యతీ లో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం ఈ రోజు గ్రామ సచి వాల యానికి వచ్చి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఆరా తీసి, అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలు పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అలాగే దేశంలోనే మోడీ గారు ప్రవేశపెట్టిన"ఉజ్వల పథకం"ఫ్రీగా ఇస్తున్నామని, ప్రధానమంత్రి ఆయుష్మాన్ పథకం గురించి ప్రజలకు వివరిస్తూ, దేశంలో ఎక్కడికి వెళ్లినా "ప్రధానమంత్రి సురక్షణ యోజన"పథకాన్ని వినియోగించుకోవాలని ఈ పథకం ద్వారా ప్రతి ఒక్క కార్డుదారునికి హాస్పటల్ నిమిత్తం ఐదు లక్షలు రూపాయల వరకు కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది కావున ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తెలియజేయడం జరిగింది... ఈ యొక్క కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం మిశ్రా సింగ్ ద్వాక్రా శ్రీనివాస్ జిల్లా పశుగణాభివృద్ధి చైర్మన్ గాడు వెంక టప్పడు మండల అధ్యక్షులు వాసు రాజు స్థానిక సర్పంచ్ గాడు వెంకట నారాయణ మండల పార్టీ అధ్యక్షులు గాడు శ్రీను జి.ఎల్లయ్య తుపాకుల పైడిరాజు శ్రీ రామానాయుడు కేబుల్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మలివిడత జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం

విశాలాంధ్ర - రాజవొమ్మంగి : రాజవొమ్మంగి సచివాలయం2 పరిధి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి అధ్య ర్యంలో మలి విడత జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం మొదటిసారి విజయ వంతం అవ్వడంతో రెండోసారి జగన్ ఆరోగ్య సురక్ష ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి జి.జనార్ధన్, ఎంపిడిఓ ఎంవి రంగారావు, పలువురు డాక్టర్లు, ఎంపిటిసిలు, వార్డు మెంబెర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

దొన్నుదొరవొద్దు..తండ్రి కోల్పోయిన అబ్రహామే ముద్దు

విశాలాంధ్ర - అనంతగిరి : నాటి నుండి నేటివరకు పార్టీ కోసం అహర్నిశలు కష్టబడి పనిచేసిన అబ్రాహాం ను పార్టీ గుర్తించకపోవడం బాధకరం అనంతగిరి మండల టీమ్ ఇటీవల నియమితులైన తెలుగుదేశం అరకు నియోజకవర్గ ఇంచార్జి దొన్ను దొరను వ్యతి రేకిస్తూ మండల పార్టీ అధ్యక్షులు అనంతగిరి మండల కేడర్ అలాగే కార్యకర్తలు గురువారం బొడ్డవరలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా అధ్యక్షులు అంటిపర్తి బుజ్జి బాబు కారదర్శి ఆనందారావు జెడ్పి ఛైర్పర్సన్ కె అప్పారావు లు మాట్లాడుతూ తల్లితండ్రి కోల్పోయిన పార్టీకి అంటి ఉంటూ పార్టీ యే సర్వము అంటూ పార్టీ బలోపేతనికి గత పది సంవత్సరాలుగా అహర్నిశలు శ్రమిస్తున్న మాజీ ఎస్సిఎస్టీ కమిషన్ మెంబర్ సివేరి అబ్రాహాంను గుర్తించక పోవడం బాధాకరమనీ ఈయనకు కాదని ఇటీవలకాలంలో పార్టీలో వచ్చిన దొన్ను దొరకు అరకు అసెంబ్లీ నియోజక వర్గ పగ్గాలు అప్పజెప్పడం ఏంటనిప్రశ్నించారు. ఇంతవరకు నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న శ్రావణ్ కుమార్ తప్పించి దున్ను దొరకు ఇన్చార్జి ఇచ్చారని వాస్తవానికి పార్టీ కోసం కష్టపడింది శ్రావణ్ మరియు అబ్రహం మాత్రమేనని ఇది సరైన నిర్ణయం కాదన్నారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ నాయకులు పార్టీ వైస్ ప్రెసిడెంట్ సమారెడ్డి దొన్ను అరకు పార్లమెంట్ సభ్యులు సుందర్రావు మాజీ ఎంపీటీసీ నరాజి దయానిధి కొరుబారికి చంద్రరావు కిల్లోకృష్ణ రాజు కిల్లో సోమా సారా మాజీ సర్పంచ్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు కళారాజు కిముడు నాగేశ్వరరావు చిరంజీవి ఎల్బీ విజయ్ కుమార్ రంజిత్ తదితర 24పంచాయితిలా బూత్ క్లస్టర్ యూనిట్ ఇంచార్జి లు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పింఛను

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ 91వ వార్డు లక్ష్మీ నగర్‌లో పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఎపి.ఎం.ఎస్.ఎం.ఈ.డిసి చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ఆదేశాల మేరకు జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు లబ్దిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికలు ముందు ఇచ్చిన హామీలను శత శాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పెన్షన్లను 3,000/- రూపాయలకు పెంచి జగనన్న మరో చరిత్ర సృష్టించారన్నారు పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగించిన జగన్మోహన్ రెడ్డి గారు ఆయా వర్గాల ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకు న్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా మరలా వైకాపా ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో 91 వ వార్డు అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ అధ్యక్షులు జి అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకృష్ణ, నీలాపు శ్రీనివాస్ రెడ్డి, ఆదినారాయణ, సురేష్, గొడ్డు నాగరాజు, ఆర్ పి.సత్య కళ వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ భావజాలంపై చైతన్యం జనభాగీధారి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : డా. బి.ఆర్. అంబేద్కర్ జీవిత విశేషాలను తెలియపరుస్తూ.. ఆయన భావజాలంపై, ఆదర్శాలపై ప్రజల్లో స్ఫూర్తి నింపుతూ లిజనభాగీధారిలి పేరిట ప్రజా చైతన్య కార్యక్రమాలను ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ జిల్లా సమన్వయ కమిటీ సభ్యులను ఆదేశించారు. ఈ నెల 19వ తేదీన అమరావతిలోని స్వరాజ్ మైదానంలో స్మృతివనం ప్రారంభోత్సవం సందర్భంగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో జిల్లాలో చేపట్టబోయే కార్యక్రమాలపై ఆయన శుక్రవారం వివిధ విభాగాల అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కార్యక్రమ షెడ్యూల్‌ను వివరిస్తూ నిర్వహణపై మార్గదర్శకాలు జారీ చేశారు. కమిటీ సభ్యులందరూ సమన్వయంతో వ్యవహరించి జనభాగీధారిలి పేరిట నిర్వహించే ప్రజా చైతన్య కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. 9, 10 తేదీల్లో అంబేద్కర్ భవన్ వద్ద, మరొక రెండు చోట్ల రక్తదాన శిబిరాలను నిర్వహించాలని, జిల్లా స్థాయి ఫొటో ఎగ్జిబిషన్, అంబేద్కర్ జీవిత విశేషాలపై డాక్యుమెంటరీలు, లఘు చిత్రాలను ప్రదర్శించాలని చెప్పారు. అలాగే 18వ తేదీన ఎల్.ఐ.సి. బిల్డింగ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాలని, మానవహారం ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులను జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏడీసీ వర్మ, సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్, డీఈవో ఎల్. చంద్రకళ, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరం

అనకాపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ మలసాల భరత్ కుమార్

విశాలాంధ్ర - కశింకోట : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు ఒక వరం వంటిదని అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ మలసాల భరత్ కుమార్ పేర్కొన్నారు. కశింకోట డి.పి.ఎన్ హై స్కూల్ లో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం డాక్టర్ తిరుమల్ రావు ఆధ్వర్యంలో జరిగింది. శుక్రవారం ఈ శిబిరాన్ని వైఎస్ఆర్ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ఎంతగానో ప్రజలకు ఉపయోగపడుతుందని అన్ని రోగ నిర్ధారణ పరీక్షలు ఇక్కడే నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ హాస్పిటల్ కు పంపించడం వలన పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకాలు రాబోయే ఎన్నికల్లో వైసిపి పార్టీని తిరిగి గెలిపిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగాల లక్ష్మి గున్నయ్యనాయుడు, సర్పంచ్ మంత్రి జయ రజిని, వైస్ ఎం పి పి పెంటకోట జ్యోతి, శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి అంగన్వాడీ రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర - గంగవరం : నేటి (శనివారం) నుండి అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు సిఐటీయు మండల కార్యదర్శి కొర్రపు రాణి అన్నారు. 26 వేలు ఇచ్చేవరకు సమ్మెను విరమించేది లేదని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వం అంగన్వాడీల పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తుందని ఈ ప్రభుత్వానికి తగదని ఆమె అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నాం తప్ప దాము గొంతెమ్మ కోరికలు కోరడం లేదని ఆమె అన్నారు. అంగన్వాడీలు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో ప్రభుత్వం పోలీసులతో దౌర్జన్య కాండ చేసిందన్నారు. ఐదవ తేదీ నుండి విధులకు హాజరు కాకపోతే ఉద్యోగాల నుండి తొలగిస్తామని ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తున్నప్పటికీ తాము సమ్మెను విరమించేది లేదని రానున్న మూడు నెలల తర్వాత జరిగే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు తమ వంతు ప్రయత్నం చేసి తీరతామన్నారు. మంత్రులు, ఎంపీలు, ఇతర నాయకులు సభ్యతను మరచి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని సమంజసం కాదని అంగన్వాడీలు హెచ్చరించారు. శుక్రవారం తహసిల్దార్, ఎంపీడీవో, ఎంఈఓ, పోలీస్ స్టేషన్, పోస్ట్ ఆఫీస్, వెలుగు కార్యాలయాల వద్ద ఫండ్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపిఎం, సీసీలు, యానిమేటర్లు అంగన్వాడీల సమ్మెకు మద్దతు ప్రకటించినట్లు తెలిపారు.

జీ తెలుగు డ్రామా జూనియర్స్ సీజన్ 7 ఆడిషన్స్ ప్రారంభం

విశాలాంధ్ర- విశాఖ సిటీ : ప్రముఖ టీవీ ఛానల్ జీ తెలుగు ప్రతిష్టాత్మక కార్యక్రమం డ్రామా జూనియర్స్ సరికొత్త సీజన్ తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నట్టు ఆ సంస్థ ప్రాంతీయ ప్రతినిధి వెల్లడించారు. చిన్న పిల్లల్లో నటనా ప్రతిభను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో డ్రామా జూనియర్స్ సీజన్ 7 ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే విజయవంతంగా 6 సీజన్ల ను పూర్తి చేసుకున్న డ్రామా జూనియర్స్ మరో సీజన్ తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమ వుతోందన్నారు. 3 నుంచి 13 సంవత్సరాల వయస్సు గల పిల్లలు డ్యాన్స్, పాటలు పాడటం, నటన, మ్యాజిక్ ట్రిక్స్, మార్షల్ ఆర్ట్స్ తో పాటు మరేదైనా టాలెంట్ ఉంటే డ్రామా జూనియర్స్ లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. జీ తెలుగు పాపులర్ షో డ్రామా జూనియర్స్ సీజన్ 7 ఆడిషన్స్ లో పాల్గొనాలనుకునే వారు తో మునుపెన్నడూ పిల్లల్లోని టాలెంట్ ను ప్రతిబింబించేలా 2 నిమిషాల నిడివి గల వీడియోను డ్రామా జూనియర్స్ ఎస్ సెవెన్ ఆడిషన్స్ డాట్ జీ5 డాట్ కామ్ లేదా డ్రామా జూనియర్స్ సీజన్ 7 ఏ జీమెయిల్ డాట్ కామ్ లేదా వాట్సాప్ నంబరు 9100054301లో సంప్రదించాలని కోరారు.

కోలాటమాడుతూ అంగన్వాడీల ఆందోళన

విశాలాంధ్ర - దుంబ్రిగుడ : సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ కార్మికులు చేపడుతున్న సమ్మె శుక్రవారం 23వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని హైవే రోడ్డు యూనియన్ బ్యాంక్ జంక్షన్ వద్ద అంగన్వాడి కార్మికులు కోలాటం ఆడుతూ ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో అందరం ఉధృతం చేపడుతామని పెద్ద ఎత్తున అంగన్వాడి కార్మికులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కే కొండమ్మ , కె.సత్యవతి, జీ పవిత్ర, కార్మికులు హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 15న ప్రధానమంత్రి జన్ మన్ ప్రోగ్రాంను జయప్రదం చేయండి

ఐటీడీఏ పీవో వి.అభిషేక్

విశాలాంధ్ర - అరకులోయ : ప్రధానమంత్రి జన్ మన్ ప్రోగ్రాం ను ఈనెల 15న అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జయప్రదం చేయాలని పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఆదేశించారు. అరకులోయ మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం సమావేశం మందిరంలో అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈనెల 15న కొత్త భల్లుగుడ బాలికల ఆశ్రమ పాటశాలలో ప్రధానమంత్రి జన్ మన్ ప్రోగ్రాం అమలుపై లబ్ధిదారులతో వర్చువల్ విధానంలో ముచ్చటిస్తారని చెప్పారు. పివిటిజి గ్రామాలలో విద్యుత్తు, తాగునీటి సౌకర్యాలు, అందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు, అటవీ హక్కు పత్రాలు, ప్రధానమంత్రి ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్ల పంపిణీ, సిగ్నల్ కనెక్టివిటీ, ఎస్టి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ అర్హులైన లబ్ధిదారులకు అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ సహాయ ప్రాజెక్టు అధికారులు విఎస్ ప్రభాకర్, ఎం. వెంకటేశ్వరరావు, హౌసింగ్ పీడీ బి. బాబు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ లీలా కృష్ణ, ఎంపీడీవో వెంకటేష్, తహసిల్దార్ వేణుగోపాల్ పలు శాఖల అధికారులు, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సంక్రాంతి తర్వాత ఉత్తరాంధ్రలో వైసిపిని ఖాళీ చేస్తాం

పార్టీని నాశనం చేసింది ఆ మూడు రత్నాలే...

వైసిపి నేతల తీరుపై జనసేన అధ్యక్షులు వంశీకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : రాష్ట్రంలో వైసిపికి వతిరేక పవనాలు మొదలయ్యాయని, సంక్రాంతి తర్వాత ఉత్తరాంధ్ర వైసీపీ ఖాళీ అవుతుందని, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో జనసేన నగర అధ్యక్షులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో విశాఖ లో కొందరు నాయకులు విశాఖ సంపదను దోచుకున్నారని , వారికి రానున్న ఎన్నికల్లో తగిన విధంగా బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. సీఎం జగన్ నవరత్నాల్లో రెండు రత్నాలు విశాఖ తూర్పు లో ఉన్నాయని, వారి వలనే ప్రభుత్వం నాశనం అవుతుందన్నారు, అనేక మంది పార్టీ కి దూరమవుతున్నారన్నారు. అన్ని వార్డుల్లో తిరిగి పార్టీ పటిష్టం చేస్తానన్నారు. ఉత్తరాంధ్రలో వైసీపీని ఖాళీ చేయిస్తానని వంశీకృష్ణ పునరుద్ఘాటించారు. సీఎం జగన్ హయాంలో విశాఖ అభివృద్ధి, భోగాపురం ఏయిర్ పోర్టు సాకారం కాదన్నారు. ఉమ్మడి ప్రభుత్వం వచ్చాక నిర్మాణం చేస్తామని, సంక్రాంతి పండగ తరువాత వైసీపీ ఖాళీ చేస్తాం అన్నారు. జీవి కి చైర్మన్ పదవి ఇచ్చారని, ధనుంజయ రెడ్డి స్నేహితుడు, రైట్ హ్యాండ్ గా ఉన్న ఎంవివీ, జీవి వైసీపీ కి రెండు రత్నాలు గా ఉన్నారన్నారు. జీవి పార్టీ జెండా మోసాడా, వైసీపీ ఆఫీసుకి వచ్చారా, ఒక్క ధర్నాకు వచ్చాడా, విశాఖ లో బిల్డర్లు అంతా వీరి మోసానికి బలి ఏడుస్తున్నారని తెలిపారు. ఎం వి వీ ,జీ వి సెటిల్ మెంట్ సైట్లు తీసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని, ఏయూ మాజీ విసి ప్రసాద రెడ్డి మూడో రత్నం అని , ఈ రత్నం వల్లే వైసీపీకి ఎస్సీ ఎస్టీ బీసిలు దూరం అయ్యారన్నారు. ప్రసాద రెడ్డి మళ్లీ వి సి అయితే అరాచకమే అన్నారు. అంగన్వాడీ, పారిశుధ్య కార్మికుల సమ్మె మీద ప్రభుత్వ స్పందన లేదని, రాష్ట్ర పరిపాలన గాలికి వదిలేసి పార్టీని వదిలి వెళ్ళే వారిని పట్టుకోవడానికి జగన్ ప్రయత్నిస్తున్నారన్నారు. ఉత్తరాంధ్రలో 20 నుంచి 30 తేదీ లోపు పార్టీలో భారీ చేరికలు వుంటాయని, ఉమ్మడి అభ్యర్థి మేయర్ అవుతారని, ఇప్పటికే అనేకమంది కార్పొరేటర్లు జనసేనతో కలిసి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో జనసేన 22 వార్డు కార్పొరేటర్ మూర్తి యాదవ్, జనసేన నేత రాజు గౌడ్ పాల్గొన్నారు.